క్లుప్తంగా

అలీకి సన్మానం



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో మంగళవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు వచ్చేసిన ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీని వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా నేత ఎండీ.కరిముల్లా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు.

ఘనంగా శోభా యాత్ర

మనుబోలు : మండల కేంద్రంలో హిందూ ధార్మిక సమ్మేళనంలో భాగంగా సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభాయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం నుంచి ప్రారంభమైన అంబేడ్కర్ విగ్రహం మీదుగా గ్రామంలోని వీధులన్నీ తిరుగుతూ శివాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆ సమితి మండల కోఆర్డినేటర్ ఆలూరు రాము మాట్లాడారు. హిందువులంతా ఐక్యంగా ఉంటూ దేశ సమగ్రతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీకి వైఎస్సార్‌సీపీ, బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు సంఘీభావం ప్రకటించారు. ఎస్ఎస్ఎఫ్ రాపూరు డివిజన్ కోఆర్డినేటర్ గణపతి, ఆధ్యాత్మికవేత్త మనోహర్‌హింద్, గీతాశ్రమ స్వామిజీ ప్రణవాత్మానంద, సర్పంచ్ పద్మమ్మ, బీజేపీ నేతలు బోలా శ్రీనివాసులు, ఒడూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కసుమూరులో ఆలయాల్లో చోరీ

వెంకటాచలం : మండలంలోని కసుమూరు పంచాయతీ పరిధిలో మాతమ్మ, పుట్టాలమ్మ ఆలయాల్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మాతమ్మ ఆలయంలో హుండీని, పుట్టాలమ్మ ఆలయంలో హుండీతో పాటు అమ్మవారి ముక్కు పుడకను అపహరించుకుని వెళ్లారు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహన కల్పించాలి

ఇందుకూరుపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. మండలంలోని పున్నూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ ఈ సంకల్పయాత్రను అన్నిశాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలన్నారు. అనంతరం కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలించారు. కేంద్ర పథకాల గురించి డిజిటల్ స్క్రీన్‌పై ప్రజలకు వివరిస్తున్నామని ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేంద్ర బాబు తెలిపారు. తహసీల్దార్ సుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ఆడాలి

మనుబోలు : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కొనసాగిస్తూ ఆటలాడాలని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో వివిధ క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలకు శ్రీకారం చుట్టారన్నారు. మండలంలోని 14 సచివాలయల పరిధిలో 124 టీమ్‌లు 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో మంగళవారం 57 మంది టీమ్‌లు క్రికెట్, వాలీబాల్, షటిల్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ పోటీలు జరుగుతున్న మైదానాల్లో క్రీడాకారుల కోసం తాగునీరు, స్నాక్స్, అరటిపండ్లు ఏర్పాటు చేశామన్నారు.

ఉచిత విద్య, వైద్యాన్ని ఎవరికైనా అందించారా..?

- టీడీపీ నేత నారాయణను ప్రశ్నించిన ఎమ్మెల్యే అనిల్



ప్రజల సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఈ నాలుగున్నరేళ్లలో నారాయణ సంస్థల్లో బలిజ సోదరులు.. టీడీపీ నేతలు, కార్యకర్తలకు వైద్యం.. వారి పిల్లలకు విద్యను ఉచితంగా అందించారానని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రశ్నించారు. నగరంలోని 48వ డివిజన్లో గల విఘ్నేశ్వరపురం, కోటమిట్ట, ఆనం వెంకటరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యే మాట్లాడారు. డబ్బున్న వారు ఎన్నికలప్పుడు వస్తుంటారు.. పూర్తవ్వగానే వెళ్లిపోతారు.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండరంటూ నారాయణను ఉద్దేశించి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇటీవల పరోక్ష వ్యాఖ్యలు చేశారని, ఇదే అంశాన్ని నగర ప్రజలందరూ విన్నారని చెప్పారు. 2019 ఎన్నికల అనంతరం కనిపించని వ్యక్తి ఎవరో టీడీపీ నేతలు, ప్రజలకు తెలుసునన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ నాలుగు నెలలే నారాయణ కనిపిస్తారని విమర్శించారు. బలిజలను తమ ప్రభుత్వం మోసం చేసిందంటూ ఆయన మాట్లాడారని, అయితే కాపు నేస్తం ద్వారా అనేక మందికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూరుస్తున్నారని చెప్పారు. ఇష్టానుసారంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): రాజకీయ పార్టీల నుంచి అందిన అర్జీలు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. 2024వ సంవత్సరానికి సంబంధించిన ఓటర్ల లిస్ట్ డ్రాఫ్ట్ రోల్, రేషనలైజేషన్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో కమిషనర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమపద్ధతిలో నమోదు చేసి.. క్షేత్రస్థాయిలో బీఎల్వోలు పరిశీలించాలని సూచించారు. ఈ నెల తొమ్మిది వరకు అందిన వివిధ ఫారాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి రోజువారీ నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఎన్నికల విభాగాధికారులు దేవీకుమారి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రితో ఆదాల భేటీ



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన జేసీ



నెల్లూరు (దర్గామిట్ట): డిప్యూటీ సీఎం రాజన్న దొరను నగరంలోని ఓ హోటల్లో జేసీ కూర్మనాథ్ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. సాధికార యాత్ర నిమిత్తం జిల్లాకు విచ్చేసిన ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

రంగనాథుడి సేవలో..



నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామిని విశాఖపట్నం విజిలెన్స్ ఎస్పీగా నియమితులైన హిమవతి మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని కానుకగా ఆమెకు అందజేశారు. తొలుత ఆలయ మర్యాదలతో ఆమెకు ఆహ్వానం పలికారు. ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు (దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం ఆవిష్కరించారు. పాఠశాలల్లో అకడమిక్ పరంగా నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రియాజ్, కృష్ణారెడ్డి, జుల్ఫికర్ అలీ, జిల్లా బాధ్యులు వెంకటేశ్వర్లురెడ్డి, గురవయ్య, రామసుబ్బారెడ్డి, సుంకు వెంకటేశ్వర్లు, రఘు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కాశీనాయన ఆరాధనోత్సవం



నెల్లూరు(బృందావనం): వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో కాశీనాయన ఆరాధనోత్సవాన్ని సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆశ్రమ సేవకులు ధన్వి శ్రీనివాస్, మహంకాళి వెంకటేష్, సిద్ధూ, గణేష్, వెంకటేశ్వర్లునాయుడు, కుడుముల వెంకటేష్, నవీన్, శివ, ముత్తు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనఘాష్టమి వ్రతం



నెల్లూరు(బృందావనం): దత్త జయంత్యుత్సవాల్లో భాగంగా బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో గల ద్వారకామాయిలో అనఘాష్టమి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. 108 మంది దంపతులు వ్రతానికి హాజరయ్యారు. ఉభయకర్తలుగా పుచ్చలపల్లి శ్రీరాములు రెడ్డి, లీలావతి, కంజర్ల భాస్కరశర్మ, భారతి దంపతులు వ్యవహరించారు. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మధుసాయి, పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని మంగళవారం నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను జరిపారు. ఉభయకర్తలుగా అవినాష్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు నంద కిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

మర్యాదపూర్వకంగా..



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛమిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి, పక్కన కిలివేటి, అనిల్‌కుమార్



సత్కరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి





బొకేను అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి

నెల్లూరు(సెంట్రల్) / నెల్లూరు(బారకాసు): నగరంలోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డిని పలువురు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, అనిల్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, మేయర్ స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి తదితరులు కలిశారు.

సినీ నటి సావిత్రికి నివాళి

నెల్లూరు(బృందావనం): మహానటి సావిత్రిని సినీ ప్రేక్షకులు ఎన్నటికీ మరువరని కేతా సుబ్బారావు ప్రజా వేదిక అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. సావిత్రి 42వ వర్ధంతిని సుబేదారుపేటలో మంగళవారం నిర్వహించారు. తొలుత నివాళులర్పించారు. అనంతరం సీనియర్ రంగస్థల కళాకారిణి రాధమ్మను సత్కరించారు.

అపరాధ రుసుము లేకుండా పన్నులు చెల్లించొచ్చు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని భవన యజమానులు 2023 - 24 సంవత్సరానికి సంబంధించిన రెండో వాయిదాను అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31లోపు చెల్లించొచ్చని కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (వేదాయపాళెం): అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నేతలు కటారి అజయ్‌కుమార్, మోహన్‌రావు, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ అభివృద్ధికి తోడ్పడాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అభివృద్ధికి అధికారులు, సిబ్బంది తోడ్పడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. నెల్లూరు కేంద్ర సహకార బ్యాంక్ రూపొందించిన క్యాలెండర్‌ను నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మంగళవారం ఆవిష్కరించారు. డీసీసీబీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సీఈఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సమ్మేళనం రేపు



మాట్లాడుతున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఆంధ్రా, తెలంగాణ కళాకారుల సాంస్కృతిక సమ్మేళనాన్ని నగరంలోని పురమందిరంలో గురువారం నిర్వహించనున్నామని కోవూరుకు చెందిన సుమధుర నాట్య మండలి అధ్యక్షుడు ఖుద్దూస్‌బాషా పేర్కొన్నారు. బట్వాడిపాళెం సమీపంలోని నాట్యమండలి కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. నాటి రంగస్థల నటులు, కళాకారులు, సాహితీవేత్తలు, అవధానులను సత్కరించనున్నామని చెప్పారు. నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడు సలీమ్, నల్లమల్లి సత్యనారాయణ, సంస్థ గౌరవాధ్యక్షుడు వెంకట్, నూర్‌బాషా సంఘ ఎంప్లాయీస్ జిల్లా అధ్యక్షుడు ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారంలో దత్తాత్రేయస్వామి



నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ, అష్టలక్ష్మి మందిరంలో దత్త జయంతిని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. దత్తాత్రేయస్వామికి అభిషేకం, రుద్ర, అష్టలక్ష్మి హోమాలు, పల్లకిసేవ తదితరాలను జరిపారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



నెల్లూరు (వేదాయపాళెం): సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నగర కార్యదర్శి అరిగెల సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని నేత రామరాజు ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నేతలు వినోదిని, వనజ, మహేశ్వరమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్, షానవాజ్, సమితి సభ్యులు వాటంబేటి నాగేంద్ర, ఆదినారాయణ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీర్ బాల్ దివస్



నెల్లూరు(బారకాసు): ధర్మం.. దేశం కోసం చిన్న వయస్సులోనే బలిదానం చేసిన వీర బాలల చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. నగరంలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముక్కు రాధాకృష్ణ, నాగేంద్రసింగ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం.. ఆంధ్రా'



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు



ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

నెల్లూరు రూరల్: ఆడుదాం.. ఆంధ్రా పోటీలను రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించారు. సౌత్‌మోపూరు, వెల్లంటి, ఆమంచర్ల, మాదరాజుగూడూరు, పెనుబర్తి సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు స్థానిక జెడ్పీ హైస్కూళ్ల మైదానాల్లో క్రికెట్ పోటీలను జరిపారు. తొమ్మిది మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. పోటీల రూరల్ మండల ప్రత్యేకాధికారి నాగరాజు, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.